క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



మద్దూరు: రాష్ట్రస్థాయి కబడ్డీ అండర్–14 విభాగంలో ఉమ్మడి జిల్లా నుంచి మండలంలోని బాలుర పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటరాంరెడ్డి తెలిపారు. ఈ నెల 19న నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీపోటీల్లో మద్దూరు బాలుర ఉన్నతపాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి కిరణ్, కనక ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

గిరక బండి పోటీలు



మాగనూర్: మండలంలోని తాళంకేరిలో మారెమ్మవ్వదేవి జాతరను పురస్కరించుకుని నిర్వహించిన గిరక బండి ఎద్దుల పోటీలలో మొదటి బహుమతి నందిత, ద్వితీయ బహుమతి వడ్వాట్ రాజు, తృతీయ బహుమతి చిట్యాల గ్రామానికి బాబు విజేతగా నిలిచారు. దీంతో పోటీలో గెలుపొందిన వారికి నిర్వాహకులు, గ్రామస్తులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

24న వీరాంజనేయ స్వామి ఉత్సవాలు

కృష్ణా: మండలంలోని ఈ నెల 24న తంగిడి వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి అణెప్ప తెలిపారు. 25న స్వామివారి పల్లకిసేవ, సాయంత్రం మంగళ వాయిద్యాలతో ప్రభోత్సవం. 26న స్వామివారి రథోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ రథోత్సవం సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన కళాకారులతో ప్రత్యేక కార్యక్రమంతోపాటు సామాజిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ఉత్సవాలకు అతిథులుగా శ్రీ గంగాధర మహాస్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిసౌకర్యాలను కల్పించినట్లు పూజారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మక్తల్: మండలంలోని ఉప్పర్‌పల్లి స్టేజీ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి.. వివరాలిలా.. మాద్వార్ గ్రామానికి చెందిన తుంగరాము (35), మక్తల్‌కు చెందిన రఘు కలిసి ద్విచక్రవాహనంపై మక్తల్‌కు వెళ్తున్న సమయంలో మక్తల్ నుంచి మాద్వార్ వైపు వస్తున్న బులెరో వాహనం ఉప్పర్‌పల్లి స్టేజీ సమీపంలో రెండు వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కోడిపందాల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



మక్తల్: కోడి పందాల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసిన సంఘటన మండలంలోని మంతన్‌గోడ్ బుధవారం చోటుచేసుకుంది. మక్తల్ మండలం మంతన్‌గోడ్ శివారులోని కోడిపందాలు ఆడుతున్న సమాచారం తెలుసుకుని దాడులు నిర్వహించి 8మందిని పట్టుకుని వారి వద్దనుంచి రూ. 16,710, నాలుగు కోళ్లను, 8బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై కేసునమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ–2 ఆచారి తెలిపారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

ఆత్మకూర్: క్షణికావేషానికి లోనై వివిధ కేసుల్లో ఉన్నవారు ఈనెల 30వ తేదీన ఆత్మకూర్‌లోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహిస్తున్న లోక్‌అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ నరేందర్ అన్నారు. మండలంలోని గ్రామాలకు చెందిన కక్షిదారులు, క్రిమినల్, సివిల్, భూతగాదాలు, వివిధ కేసుల్లో ఉన్న వారు రాజీ మార్గమే రాజ మార్గముగా గుర్తించి రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. దీనివల్ల ఎంతో విలువైన సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందన్నారు. పూర్తి వివరాలకు కక్షిదారులు నేరుగా పోలీస్‌స్టేషన్‌లో లేదా ఫోన్ 87126 70631 నంబరును సంప్రదించాలని కోరారు.

ఈకేవైసీకోసం బారులు

- గ్యాస్ ఏజెన్సీలో 5వేలమంది లబ్ధిదారులు
- ఈకేవైసీకి డిసెంబర్ వరకు గడువు అపోహతో ఆందోళన
- ఇప్పటివరకు వెయ్యి వరకు పూర్తి



ఈకేవైసీ కోసం క్యూలైన్‌లో నిల్చున్న మహిళలు

దామరగిద్ద: కేంద్ర ప్రభుత్వం ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత సిలిండర్లు పొందిన ఉజ్వల వారికి వంటగ్యాస్ సబ్సిడీ పెంచడంతో ఈకేవైసీ తప్పనిసరి చేసిందని.. డిసెంబర్ వరకే గడువు ఉందన్న ఆపోహతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. దీంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద కేవైసీ అప్‌డేషన్ కోసం బారులు తీరుతున్నారు. గతంలో కేవలం సాధారణ లబ్ధిదారులకు రూ. 46 సబ్సిడీ వచ్చేది. కాగా మూడు నెలల నుంచి ఉజ్వల పథకం లబ్ధిదారులకు సబ్సిడీ మొత్తం 300లకు పెంచడంతో అర్హులైన వారికి సబ్సిడీ వర్తించేందుకు ఈకేవైసీని అమలు చేస్తుంది. దీంతో మండల కేంద్రంలోని సంజయ్ ఇండెన్ గ్యాస్ ఏజెన్సీకి బారులు తీరారు. గ్యాస్ ఏజెన్సీలో ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లో లబ్దిదారుల ఆధార్ నెంబర్ ఫొటోతో అనుసంధానం చేస్తూ ఈకేవైసీ నమోదు చేస్తున్నారు.

రూ. 500లకే గ్యాస్ పేరుతో బారులు

తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 500 వందలకు సిలిండర్ పథకంపై ఎన్నికల్లో హామీ ఇవ్వడంతో ఆదేసిలిండర్ కోసమని గ్యాస్ లబ్దిదారులు బారులు తీరుతున్న పరిస్థితి, కాగా వాస్తవానికి కొత్త ప్రభుత్వం ఐదు వందలకే సిలిండర్ పథకంపై ఎలాంటి ఆదేశాలను జారీ చేయలేదని అధికారులు చెబుతున్నారు. కేవలం ఉజ్వల లబ్ధిదారులకు మాత్రమే ఈకేవైసీ చేసుకోవాల్సి ఉండగా ఈకేవైసీకి అందరు లబ్ధిదారులు రావడంతో గ్యాస్ ఏజెన్సీలకు బారులు తీరుతున్నారు. మరో వైపు ఈకేవైసీ చేసుకునేందుకు ఎలాంటి గడువు లేక పోయిన డిసెంబర్ వరకు గడువు పేరుతో ఆందోళన చెందుతున్నారు.

ఈకేవైసీ ఇలా..

ఉజ్వల పథకం లబ్ధిదారులు తమ ఆధార్ కార్డుతో పాటు గ్యాస్ ఏజెన్సీలో అందించిన గ్యాస్ ఖాతా బుక్, లబ్ధిదారు అవసరం. ప్రత్యేకంగా రూపొందించిన సైట్‌లో ఏజెన్సీ నిర్వాహకుల ద్వారా ఐరీస్, ఫొటో అథెంటికేషన్ ద్వారా ఈకేవైసీ చేపడుతున్నారు. ఇప్పటి వరకు వెయ్యికి పైగా లబ్ధిదారుల ఖాతాలు ఈకేవైసీ పూర్తిచేసినట్లు సమాచారం.

ఉజ్వల లబ్ధిదారులకు మాత్రమే..



కేంద్ర ప్రభుత్వం ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందిన లబ్ధిదారులకు మాత్రమే ఈకేవైసీ చేస్తున్నాం. ఇండెన్ గ్యాస్ ఏజెన్సీలో మొత్తం 12వేలకు పైగా ఉండగా అందులో 5వేలకు పైగా లబ్దిదారులు ఉన్నారు. కాగా రూ. 500లకే సిలిండర్ కోసమేనని అపోహతో ఈకేవైసీకి వస్తున్నారు. లబ్దిదారులు తప్పనిసరిగా రావాల్సిన అవసరం లేదు. రిఫిలింగ్ సిలిండర్ అందించే సమయంలో ఇంటి వద్దే ఈకేవైసీ తీసుకుంటాం.

– భీమయ్యగౌడ్, నిర్వహకుడు, దామరగిద్ద

ఆధార్‌లింక్ కోసం వచ్చాం..



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినందుకు రూ. 500 వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తారని చెప్పినందుకు ఆధార్ లింక్ చేసుకోవాలంటే వచ్చాను. ఇక్కడ నాలాంటి వారు చాలా మంది వచ్చారు. లైన్‌లో నిలబడ్డాం. ఐదు వందల సబ్సిడీ సిలిండర్ ఇంకా ఇవ్వడంతో లేదు అని, ఎలాగో వచ్చినవ్ కదా అని ఆధార్ లింక్ అయితే చేసుకో అని చెప్పింద్రు.

– భీమమ్మ, కాన్‌కుర్తి

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



మెట్లపై కర్పూరం వెలిగించి పూజలు చేస్తున్న గురుస్వాములు



పెద్దపొర్లలో ..

నారాయణపేట రూరల్: పట్టణంలోని వల్లంపల్లిరోడ్‌లో శబరిపీఠంలో అయ్యప్పస్వామి 18మెట్ల పడి పూజా కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 18మెట్లపై గణనాథుడు, సుబ్రమణ్యేశ్వరుడితో కలిసి అయ్యప్పస్వామివారిని పంచామృతాభిషేకం, కళశపూజ, జ్యోతి ప్రజ్వలనతోపాటు మెట్లపై కర్పూరం వెలిగించి పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వాములు చేసిన పేటతుల్లి ఆటలు ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు పెద్ద సంఖ్యలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాకర్ల భీమయ్య, వెంకటేష్, శంకర్‌రెడ్డి, బాబు, బాలాజీ, కన్నయ్య, కిషోర్, రాజశేఖర్, తిప్పన్న, వెంకట్రాములు, రవికిరణ్, లింగు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో బుధవారం అయ్యప్ప మహాపడి పూజను భక్తులు ఘనంగా నిర్వహించారు. భగవంతు గురుస్వామి, రఘు గురుస్వామిల ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో స్వామివారికి ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయం వద్ద పడిపూజ నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం, కలశపూజ, మహామంగళ హారతి, నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. గురుస్వాములు గాల నర్సింహులు, కతలప్ప, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప మహాపడిపూజ

మద్దూరు: మండలంలోని అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కాచెరువు వద్ద అయ్యప్ప ఆలయ ఆవరణలో స్వామివారి మహాపడిపూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు కోట్ల ఆంజనేయస్వామి ఆలయం నుంచి కలశ ఊరేగింపూ అనంతరం అలయం అవరణలో పడిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఊట్కూరు: మండలంలోని సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని ఘనంగా సన్మానించారు. మంగళవారం రాత్రి ఊట్కూరు, చిన్నపొర్ల, పెద్దజట్రం, నిడుగుర్తి, ఎడివెల్లి, మల్లెపల్లి తదితర గ్రామాల సర్పంచ్‌లు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, కతలప్ప, భాస్కర్, కృష్ణార్జునరెడ్డి, శంకరన్న తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో కోటకొండ భక్తమండలి..



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండకు చెందిన భక్తులు బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానంలో అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వరస్వామికి సంబంధించిన పలు భక్తి పాటలపై భజనలు చేసి భక్తులకు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షులు కాశీనాథ్, రాములు, సురేష్, కాశప్ప, కిషన్‌బాబు, వెంకటయ్య, చిట్టిబాబు, కృష్ణయ్య పాల్గొన్నారు.

వృథాగా ఎరువు తయారీ షెడ్లు

మరికల్: గ్రామాల్లో సేకరించిన వ్యర్థ పదార్థాలను వేరుచేసి సేంద్రియ ఎరువులు తయారు చేసే షెడ్లు వృథాగా దర్శనమిస్తున్నాయి. మండలంలో ఎక్కడ కూడా ప్లాస్టిక్‌తోపాటు తడి, పొడి చెత్తలను వేరు చేయడం లేదు. అధికారుల పర్యావేక్షణ లేక డంపింగ్ యార్డులో వేసిన చెత్తకు నిప్పుపెట్టి ఎరువుల తయారికి ఎగనామం పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సేంద్రియ ఎరువుల తయారికి చర్యలు తీసుకోవాల్సింది ఎంతైన ఉంది.



వృథాగా దర్శనమిస్తున్న ఎరువుల తయారి షెడ్

కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- నిబంధనలు పాటించని ట్రాక్టర్ యాజమానులు
- పట్టించుకోని అధికారులు



ఉజ్జెల్లి సమీపంలో కేజ్‌వీల్స్‌తో రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్(ఫైల్)

మాగనూర్: కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్లపైకి రావడంతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. ట్రాక్టర్లు కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి రావొద్దని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రోడ్లు ధ్వంసమై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి, నేరడగందొడ్డి, కొత్తపల్లి, వాడ్వట్, మందిపల్లి, కోల్పూర్, అడవి సత్యారం, గురువలింగంపల్లి తదితర ప్రాంతాల్లో ట్రాక్టర్లు కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వస్తున్నాయి. దీంతో రోడ్లు కోతకు గురవుతున్నాయి. రాను రాను ఆ ప్రదేశాల్లో కంకర తేలి గోతులు ఏర్పడుతున్నాయి. ఎక్కడ గోతుల్లో పడిపోతామోనని వాహనదారులు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వ నిబంధనలివి..

కేజ్‌వీల్స్ బిగించిన ట్రాక్టర్‌ను తారు రోడ్డుపై నడపడం ప్రభుత్వం నిషేధించింది. ఈ మేరకు రహదారులు, పోలీసు, రెవెన్యూ, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవచ్చు. కేజ్‌వీల్స్‌తో రోడ్డుపై వెళ్తూ మొదటిసారి పట్టుబడితే రూ.5 వేలు జరిమానా విధిస్తారు. అదే ట్రాక్టర్ రెండోసారి పట్టుబడితే ట్రాక్టర్‌ను సీజ్ చేస్తారు. అలాగే డ్రైవర్‌కు ఆరునెలలు జైలు శిక్ష విధించవచ్చు. ఈ నిబంధనలు ఉన్నా, అధికారులు తనిఖీలు అంతంత మాత్రంగానే ఉండటంతో పలువురు కేజ్‌వీల్స్‌తో రోడ్లపై దర్జాగా తిరుగుతున్నారు.

పాటించాల్సిన నిబంధనలు..

- వివిధ వ్యవసాయ పనుల నిమిత్తం కేజ్‌వీల్స్ తీసుకెళ్లాల్సి వస్తే ట్రాక్టర్ యాజమాని పనిచేసే పొలానికి కేజ్‌వీల్స్‌ను ట్రాలీలో కానీ మరే ఇతర వాహనంలో తీసుకుపోవాలి.
- ట్రాక్టర్‌కు కేజ్‌వీల్స్‌ను బిగించి పనులు ముగిసిన అనంతరం వాహనంలో మళ్లీ ట్రాక్టర్ నుంచి విడదీసి ఇతర వాహనంలో ఇంటికి తీసుకువెళ్లాలి.

కేసునమోదు చేస్తాం..



కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వస్తే కేసునమోదు చేసి జరిమానా విధిస్తాం. ఎవరికైనా రోడ్డుపై కేజ్‌వీల్స్ కనబడితే పోలీసుశాఖకు సమాచారం అందించాలి. మండల రైతులకు గతంలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి సమస్యపై వివరించాం. అయినా అలానే చేస్తే చర్యలు తప్పవు.

– మల్లేష్ ఎస్‌ఐ, మాగనూర్

పూర్వ విద్యార్థుల సహకారం



ప్లేట్లు, బీరువా అందజేస్తున్న పూర్వ విద్యార్థులతో హెచ్‌ఎం ఉపాధ్యాయులు

దామరగిద్ద: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 2009–10 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందించారు. బుధవారం స్థానిక పాఠశాల ఎచ్‌ఎం జ్యోతి సమక్షంలో పాఠశాలకు 12 లాకర్ల బీర్వా, 200మంది విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు తిప్పన్న, మహిపాల్‌రెడ్డి శ్రీనివాస్, తిరుపతయ్య మాట్లాడుతూ తమవంతు సహకారాన్ని అందించడం నేటి విద్యార్థులు ఎంతో ఆదర్శనీయమని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, శీనయ్య, లక్ష్మణ్, శశిరేఖ, జ్యోతి, పూర్వ విద్యార్థులు భూపాల్‌రెడ్డి, రాజేశ్వర్, దస్తగిరి, హరీష్, వెంకటేష్, శ్రీను, రఘుపాల్, శాంతు, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలి



కిష్టాపూర్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది

ధన్వాడ: బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని సీఆర్‌పీ వెంకట్‌రాములు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కిష్టాపూర్ తండాలో బడి బయట ఉన్న బడిఈడు పిల్లలను వారు గుర్తించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి బడికి రాని పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఒక వికలాంగురాలు విద్యార్థిని గుర్తించి తిరిగి బడిలో చేరిృంచారు. కార్యక్రమంలో సీఆర్‌పీ వెంకట్‌రాములు, ఐఈఆర్‌పీఎస్ మాసన్న తదితరులు ఉన్నారు.

సీడీఎంఏను కలిసిన మున్సిపల్ కమిషనర్



హరిచందనను కలిసిన కమిషనర్ శశిధర్

కోస్గి: మున్సిపల్ శాఖ నూతన సీడీఎంఏగా బాధ్యతలు తీసుకున్న ఐఏఎస్ అధికారిణి దాసరి హరిచందనను కోస్గి మున్సిపల్ కమిషనర్ శశిధర్ కలిశారు. ఈ మేరకు బుధవారం హైదాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయంలో కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన హరిచందన కాంగ్రెస్ ప్రభుత్వంలో సీడీఎంఏగా బాధ్యతలు తీసుకోగా కమిషనర్ ఆమెను కలిశారు.

కేఎస్‌ఆర్‌కు గీతకార్మికుల సన్మానం



శివకుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నారాయణపేట: తన మేన కొడలికి టికెట్ ఇప్పించి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డిని గెలిపించిన డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి (కేఎస్‌ఆర్)ను బుధవారం సీవీఆర్ భవన్‌లో పేట గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.మనోహర్‌ప్రసాద్‌గౌడ్, సోసైటీ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణగౌడ్, గీతకార్మిక సంఘం పెద్దలు, సభ్యులు ఉన్నారు.

కల్వర్టు ఇలా.. మురుగు పారేదెలా?



ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు నీరు

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్–కోల్పూర్ ప్రధాన రహదారిపై ఉన్న ఓ కల్వర్టు పూర్తిగా మట్టితో కూరుకుపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు ముందుకు వెళ్లక ఇళ్లమధ్యనే నిలిచిపోతుందని గ్రాస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నిరోజులుగా మరుగుతో దోమలు, పందులతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు వద్ద మట్టిని తొలగించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుర్మయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి



రాస్తారోకో చేస్తున్న పులిమామిడి గ్రామస్తులు

మక్తల్: ఊట్కూర్ మండలం పులిమామిడి గ్రామానికి చెందిన కుర్మయ్య మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని చందాపూర్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే కుర్మయ్య మృతి చెందాడని బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో పులిమామిడి గ్రామస్తులు రాస్తారోకో చేశారు. అనంతరం కుర్మయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్‌అంతరాయం ఏర్పడంతో ఏఎస్‌ఐ ఎల్లయ్య అక్కడికి చేరుకుని లారీ డ్రైవర్‌తో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటం



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అమరచింత: బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా సీఐటీయూ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తున్నామని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జి.శ్రీనివాసులు 25వ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేస్తూ నిరంతరం కార్మికుల మధ్య ఉంటూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వాలతో పోరాడి వారికి పథకాలు అందేలా సీపీఎం కార్యకర్తలు పనిచేయాలని కోరారు. రమేష్, అజయ్, శ్యాంసుందర్, బుచ్చన్న, రాఘవేంద్ర పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

ఆత్మకూర్: తలసేమియా వ్యాధితో వందలాదిమంది చిన్నారులు బాధపడుతున్నారని రక్తదానం చేసి వారికి పునజన్మను ప్రసాదించాలని వివేకనందసేవాసమితి జిల్లాఅధ్యక్షుడు మాస్టర్ బాలు కోరారు. ఇనెల 22 శుక్రవారంరోజున స్తానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరనంలో మెగా రక్తదాన శిబిరంను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 848456391, 7780179152కు సంప్రదించాలన్నారు.